# ట్రాప్

గోదావరి ఎక్స్‌ప్రెస్ వదల డానికి సిద్ధంగా వుంది.

5-7, మిడిల్ బెర్తులో ఆమె. ఒంటరిగా ఎక్కడికి పోతోందో ఆమె.

కంప్యూటరు రిజర్వేషనుకి మరోసారి ధన్యవాదాలర్పించాను. నాకు క్రింద బెర్తు ఆమెకు మిడిల్ ఇచ్చినందుకు.

ఖచ్చితంగా ఆమె అడుగుతుంది. తనకు క్రింది బెర్తు ఇచ్చేయమని 'ఎక్చేంజి ఆఫర్'. అదృష్టం అంటే అలా వుండాలి.

అకస్మాత్తు ప్రయాణం. అదృష్టం... వార ఫలాలు సిద్ధాంతిగారు బాగానే జోడించారు. "మేడమ్! ఎక్కడికి ఒంటరిగా వెళ్తున్నారు?" మొహం మీద నవ్వు స్టిక్కరొకటి అంటించుకొని అడగనే అడిగాను.

ఆహ్లాదంగా "హైదరాబాద్. ది కేపిటల్" అంది. మూతి ముప్పయి వంకరలు తిప్పింది. నాజూకయిన నవ్వులు ఫాలో అయ్యాయి.



ఈమెనెలాగయినా ట్రాప్ చెయ్యాలి. ప్రయాణంలో ప్రణయంలా ... మనసు పరిపరివిధాల ఆలోచించసాగింది.

యవ్వనం తాలూకు ఆకర్షణ!

"వీడి పీడ ఎలాగయినా వదుల్చుకోవాలి" ఆమె ఆలోచన.

"బెర్తు సరిచేసుకోవాలి. కొంచెం లేస్తారా?"

కోటి వీణలు మ్రోగిన కంఠం.

ఇబ్బందిగా కదిలాను.

గొలుసులాగి బెర్తు ఎత్తింది.

అయినా ఇలాటి వాళ్ళు రాత్రి కొంచెం చెయ్యి వేస్తే సై అంటారు.

"అంత వేగం నిద్రపోవడం అవసరమా? ఇంతకూ హైదరాబాద్‌లో ఏం పనో అమ్మాయిగారికి" మాటలు కల్పుతూ అన్నాను.

"హెచ్.ఐ.వి. టెస్టుకోసం. తెల్సిన డాక్టరున్నారు" అంది.

నా మెదడులో నరాలు చిట్లినంతపనయింది.

నేను కూడా బెర్తు సర్దుకున్నాను. నాకు నిద్ర కరువైంది.

ఆమె హాయిగా నిద్రపోతోంది. తెల్లారే వరకూ.

ట్రెయిను దిగుతూ మాత్రం అంది. "ఒక అబద్ధంతో హాయిగా నిద్రపట్టింది నాకు" అని.

మరోసారి మెదడు మొద్దుబారింది!

**-గుడిమెట్ల గోపాలకృష్ణ**

# వైద్యరంగంలో భారత్ ప్రగతి

గత కొన్ని సంవత్సరాలుగా మన దేశానికి గొప్ప పేరు సంపాదించి అపారమైన సంపత్తి ఆర్జిస్తున్న రంగం ఏదీ అంటే ఆ ఘనత వైద్య రంగానికి దక్కుతుంది. పాశ్చాత్య దేశాల్లో సదుపాయాలు మామూలు పౌరునకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. జాతీయారోగ్య ప్రణాళిక ఉన్న బ్రిటన్‌లాంటి దేశంలో కూడా కావలసిన వైద్య సదుపాయాలు పొందాలంటే పేరు దాఖలు చేసుకొని చాలాకాలం వేచి ఉండాలి. పైగా ఖర్చులు అధికం. ఈ అవకాశాన్ని గ్రహించి సద్వినియోగించుకునే ఉద్దేశ్యంతో మన దేశంలోని పెద్దపెద్ద ఆస్పత్రులు విదేశీ రోగులని ఆకర్షించటానికి సిద్ధపడుతున్నాయి. ఏటా మనదేశం చూడటానికి వచ్చే మామూలు టూరిస్ట్‌లకన్నా ఆరోగ్య రీత్యా



వచ్చే యాత్రికుల సంఖ్య పెరుగుతున్నది. సాలీనా వీరి మీద 5 బిలియన్ డాలర్లు సంపాదించవచ్చని అంచనా. ఇది సాధ్యం కావటానికి కారణాల కోసం ఎంతో దూరం వెతకనక్కరలేదు. ప్రపంచంలో ఏ దేశానికీ తీసిపోని స్థాయిలో వైద్య సదుపాయాలు అతి తక్కువ ఖర్చులో మనం కలిగించటమే. హార్ట్ బైపాస్ సర్జరీ అమెరికాలో 30,000 డాలర్లు అయితే మన దేశంలో దాని ఖర్చు 6,000 డాలర్లు మాత్రమే. అదేవిధంగా బోన్‌మేరో మార్పు అక్కడ 250,000 డాలర్లు అయితే మనదేశంలో 26,000 డాలర్లు మాత్రమే. బ్రిటన్‌లోని వృద్ధులు అనేకమంది తమ దేశంలో వెయిట్ చేస్తూ కూర్చోటంకన్నా మన దేశం వచ్చి వెంటనే ఆపరేషన్‌లు చేయించు కోవటం తమకి లాభసాటి అని భావించి ఇక్కడికి వస్తున్నారు. ప్రక్కనున్న పాకిస్తాన్ నుండి వచ్చే రోగుల సంఖ్య పెరుగుదల మనం రోజూ పత్రికలలో చదువుతూనే ఉన్నాం. ఇవేకాక అతి క్లిష్టమైన మెదడు సర్జరీలు, పంటికి సంబంధించిన ఫిల్లింగ్స్, కంటి సర్జరీలు వగైరా కూడా చాలామంది విదేశీయులని ఆకర్షిస్తున్నాయి. క్రిందటి ఏడు ఆరోగ్య కారణాలుగా 150,000 మంది మన దేశం వచ్చారని తెలుస్తోంది. ఈ పథంలో మనం వృద్ధి చెందుతూ పోతే భవిష్యత్తులో మన దేశంలో అంతర్జాతీయ స్థాయిలో వృద్ధుల కేర్ హోమ్స్ (ఓల్డ్ ఏజ్ హోమ్స్) స్థాపనకి కూడా గిరాకీ వస్తుందనిపిస్తోంది. **- వి.కె. మోహన్**